క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలో ఆరుగురికి మంజూరైన రూ. 4.65 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు బాధితులకు మంగళవారం అందజేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్యసురక్ష వంటి అనేక కార్యక్రమాల అమలు ద్వారా ప్రజారోగ్యానికి తమ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు చేయూత నిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వనాథ రవికి అభినందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విజయవాడ సిటీ ప్రెసిడెంట్‌గా నియమితులైన విశ్వనాథ రవి మంగళవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి విశ్వనాథ రవిని అభినందించారు.

అభివృద్ధికి కేరాఫ్ సత్యనారాయణపురం

సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సత్యనారాయణపురం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి ఆయన 33వ డివిజన్‌లో మంగళవారం పర్యటించారు. సంక్షేమ పథకాల అమలుపై స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నగరం నడిబొడ్డున ఉన్న సత్యనారాయణపురంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. అదే విధంగా ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు



33వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

ఇవ్వడంతో పాటు ఒక్కొక్క ఇంటికి కనీసం మూడు, నాలుగు పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఏ ఇంటికి వెళ్లినా జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలంటూ ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారని అన్నారు. తమ బతుకులు బాగుండాలన్నా.. తమ బిడ్డల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలన్న అది సీఎం జగన్‌తోనే సాధ్యమని ప్రతీ మహిళా కోరుకుంటోందని, రానున్న ఎన్నికల్లో జగనన్నను సీఎం చేసేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాసరావు, నాయకులు గోపాలకృష్ణ, కే వెంకటరమణ, ఎం రామకృష్ణ, కే రత్నకుమార్, సారికలక్ష్మీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, పీ పట్టాభిరామరాజు, చిన్నా, జీ వెంకటేశ్వరరాజు, వివేకానంద, కే వెంకటేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవంతోనే సమసమాజం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అసమానతలు లేని సమాజం సామాజిక విప్లవం ద్వారానే సాధ్యమని కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. హనుమాన్‌పేటలోని టీవీ భవన్‌లో మంగళవారం ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, మేరీస్ స్టెల్లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను రూపుమాపడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. లింగ సమానత్వం, కుల వివక్షత రూపుమాపడం, పేదరిక నిర్మూలన వంటి సవాళ్లను అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని అసమానతలు లేని సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సామాజిక న్యాయానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆయా దేశాల్లో కులమత, ప్రాంతీయ తత్వాలకు అతీతంగా సామాజిక జీవనాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. ఉన్నత స్థాయి విద్యావంతులు కూడా కులమత, సామాజిక, ఆర్థిక పరమైన అంశాల్లో సంకుచిత ఆలోచనలు చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. సమాజంలో ఇటువంటివి వాంఛనీయం కాదని, వీటిని రూపుమాపాలంటే మరో సామాజిక విప్లవం అవసరమని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పీ విజయబాబు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. అనంతరం బాలలపై వేధింపులు అరికట్టాలని రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మేరీ స్టెల్లా కళాశాల సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ సిస్టర్ సహాయమేరి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ డైరెక్టర్ బీఎస్ కోటేశ్వరరావు, కోఆర్డినేటర్ అరవ రమేష్, దిశ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అహ్మదున్నీసా, జనశిక్షణ సంస్థ చైర్మన్ నాగళ్ల విద్యాకన్నా, డైరెక్టర్ పూర్ణిమ, స్టెల్లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

వలంటీర్లు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వార్డు వలంటీర్లు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 36వ డివిజన్ పరిధిలోని సీతన్నపేట నందు కల్యాణ మండపంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఉత్తమ సేవలందించిన వార్డు వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. 28, 31, 32, 33, 36 డివిజన్లకు చెందిన 314 మందికి పురస్కారాలు అందజేశారు. వలంటీర్లకు జ్ఞాపికలు అందజేసి శాలువాతో సత్కరించారు. వెలంపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో



వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాతృభాష అమృత తుల్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాతృభాష అమృత తుల్యం అని రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగ అధ్యక్షుడు డాక్టర్ కట్టెపోగు సురేశ్‌కుమార్ అన్నారు. మాచవరం సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని ఆయన 'మాతృభాష వైశిష్ట్యం-శాస్త్రీయ అవగాహన' అనే అంశంపై ఉపన్యసించారు. మాతృభాషను మనం అభివృద్ధి చేసుకోకపోతే భాషలతో ముడిపడి ఉన్న సంస్కృతి ఉనికికే ప్రమాదమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐసీఏఐ విజయవాడ శాఖ అధ్యక్షుడిగా నిట్టా రవికిషోర్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ శాఖ అధ్యక్షుడిగా నిట్టా రవికిషోర్ ఎన్నికయ్యారు. నగరంలోని ఐసీఏఐ భవన్‌లో మంగళవారం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా కె.నారాయణ, కార్యదర్శిగా యు.జయంత్, కోశాధికారిగా మనీష్ కుమార్ జైన్, ఐసీఏఐ విజయవాడ శాఖ విద్యార్థి సంఘం చైర్మన్‌గా వీవీ పవన్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నిట్టా రవికిషోర్ మాట్లాడుతూ సీఏ కోర్సు చదువుతున్న విద్యార్థులకు కోర్సులోని అంశాలపై తమ కమిటీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఐసీఏఐ విజయవాడ శాఖ పూర్వ అధ్యక్షుడు వి.నరేంద్రబాబు, జి.శ్రీనివాసరావు, ఎస్.అక్కయ్య నాయుడు తదితరులు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.

శ్రీవారి భక్తుడిని కాపాడిన తిరుమల పోలీసులు

తిరుమల: తిరుమలలోని అవ్వాచారి కోనలో దూకేందుకు ప్రయత్నించిన ఓ శ్రీవారి భక్తుడిని తిరుమల టూ టౌన్ పోలీసులు కాపాడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన సాయి హర్ష(32) తిరుమల శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాడు. సప్తగిరి గెస్ట్ హౌస్‌లో గది అద్దెకు తీసుకున్నారు. ఈ సమయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగడంతో మనస్తాపానికి గురైన సాయిహర్ష భార్యకు చెప్పకుండా బయటకు వచ్చి అక్కడ డిస్‌ప్లే బోర్డులో ఉన్న సీఐ సత్యనారాయణ నంబర్‌కు కాల్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని సమాచారం అందించాడు. దీంతో వెంటనే స్పందించిన సీఐ తమ సిబ్బందితో కలసి సాయి హర్ష ఉన్న ప్రాంతానికి వెళ్లి అతన్ని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్‌లో పలు 11కేవీ ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కస్తూరిబాయిపేట ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎనిమిది నుంచి 10 గంటల విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బీవీ సుధాకర్ తెలిపారు.

'బెజవాడ రౌడీ' బొండా ఉమా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా బెజవాడ రౌడీ అని, టీడీపీ అధికారంలో ఉండగా కాల్‌మనీ సెక్స్ రాకెట్, భూ కబ్జాలకు పాల్పడ్డారని 23వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు అన్నారు. డివిజన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు చావాలి అబ్రహంలింకన్, ఎ. నిరంజన్, స్థానిక నాయకులు వీ వాసు, శివారెడ్డి, లాలిబాబు, పసుమర్తి రాజేష్, ఒగ్గు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 63వ డివిజన్‌లో వెలంపల్లి పర్యటన

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 63వ డివిజన్‌లో పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పార్థివదేహం మెడికల్ కళాశాలకు అందజేత

విస్సన్నపేట: స్థానిక కాకతీయ కమ్మ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ కాంట్రాక్టర్ చలసాని వెంకటేశ్వరరావు సతీమణి విజయలక్ష్మి (73) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి తదితరులు విజయలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పించారు. విజయలక్ష్మి పార్థివదేహాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు మంగళవారం కుటుంబ సభ్యులు అందజేశారు.

రూ.8.17 లక్షలతో యూజీడీ నిర్మాణం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్ నందమూరినగర్‌లో రూ. 8.17 లక్షలతో చేపట్టిన యూజీడీ నిర్మాణ పనులను మంగళవారం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు.

భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలితులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు దుర్గాపురంలోని శృంగేరీ శారదా పీఠంలో వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు, రుత్వికులు కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్‌ప్రసాద్ పర్యవేక్షించారు.

శివరామకృష్ణ క్షేత్రంలో అన్నమయ్య సంకీర్తన

విజయవాడ కల్చరల్: అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార బృందం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ రమాసత్యనారాయణ మాట్లాడుతూ అన్నమయ్య పదాలు తెలుగు భాషా వీచికలుగా అభివర్ణించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను ఆయన సత్కరించారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో మలేరియా విభాగం ఆధ్వర్యాన మంగళవారం దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు.